



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

మల్లన్న ఆలయంలో మూలవిరాట్టు దర్శనం నిలిపివేత

- సుందరీకరణ పనులు ప్రారంభం

చేర్యాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయంలో మూలవిరాట్టు దర్శనం నిలిపివేశారు. ఈనెల 29న స్వామివారి కల్యాణం జరగనుండడంతో ఐదు రోజులపాటు దేవతామూర్తుల మూలవిరాట్టు అలంకరణ, అంతరాలయానికి రంగులతో సుందరీకరించనున్నారు. దీంతో గర్భాలయ ప్రవేశం తాత్కాలికంగా నిలిపివేశారు. భక్తుల దర్శనార్థం అర్ధమండపంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను నెలకొల్పారు. కల్యాణం తెల్లవారుజామున దృష్టి కుంభం, బలిహరణ నిర్వహించిన అనంతరం గర్భాలయ ప్రవేశం, భక్తుల దర్శనం ప్రారంభించనున్నట్లు ఆలయప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్ తెలిపారు.

మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య రాక

వీరశైవాగమశాస్త్రం ప్రకారం నిర్వహిస్తున్న మల్లన్న కల్యాణానికి వీరశైవుల పీఠాధిపతి పర్యవేక్షణలో కొనసాగిస్తా రు. ఈ ఏడాది కల్యాణానికి ఉత్తరప్రదేశ్ వారణాసికి చెందిన కాశీ జ్ఞానసింహాసనాధీశ్వర పీఠాధిపతి 1008 జగద్గురు మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్యస్వామి రానున్నారు.



మహాసభలకు హాజరైన గవర్నర్, ప్రముఖులతో పలు వేషధారణలో విద్యార్థులు

రాష్ట్ర, జాతీయ శక్తి యువత

- అభివృద్ధిలో 'ఏబీవీపీ' కార్యకర్తల పాత్ర కీలకం : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- అట్టహాసంగా ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు ప్రారంభం
- ఏబీవీపీ అఖిల భారత సంఘటన కార్యదర్శి ఆశిష్ చౌహాన్, ప్రముఖులు హాజరు
- రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



సిద్దిపేటలో నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న గవర్నర్

సిద్దిపేట క్రైం, డిసెంబరు 23 : అఖిల భారత విద్యార్థి పరిషత్ వ్యక్తి వికాసం కోసం కాకుండా జాతీయ వికాసం కోసం పనిచేస్తుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రాష్ట్ర, జాతీయ శక్తి యువతనే అని ఆయన కొనియాడారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో సోమవారం అఖిల భారత విద్యార్థి పరిషత్ 43వ రాష్ట్ర మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ అభివృద్ధిలో ఏబీవీపీ కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. అందరూ భరతమాత సేవలో తరించాలన్నారు. ఏబీవీపీ నుంచి ఎదిగిన ఎంతోమంది గొప్ప లీడర్లుగా ఉన్నారని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. ముందుగా ఈ మహాసభల్లో ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా జనారెడ్డి, కార్యదర్శిగా కంచర్ల రాంబాబును ఎన్నుకున్నారు. ఏబీవీపీ ప్రస్థానం భిన్నమైనదని ఏబీవీపీ అఖిల భారత సంఘటన కార్యదర్శి ఆశిష్ చౌహాన్ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్, గుజరాత్‌తో పాటు, పలు రాష్ట్రాల్లో మహాసభలు నిర్వహించామని ఎన్నో విద్యారంగ సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. ఏబీవీపీ సామాజిక సమస్యలపై పోరాటం చేస్తుందని

మిగతా 6వ పేజీలో...



గవర్నర్‌కు ఘన స్వాగతం

సిద్దిపేట కలెక్టరేట్ : సిద్దిపేట జిల్లా ఐడీవోసీకి సోమవారం ఉదయం 10:57నిమిషాలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేరుకున్నారు. కలెక్టర్ మనుచౌదరి, ఇన్‌చార్జి సీపీ అకిల్ మహాజన్ ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐడీవోసీ మొదటి అంతస్తులోని స్టేట్‌చాంబర్‌లో తేనేటి విందును స్వీకరించి కలెక్టర్‌తో ముచ్చటించారు. 11:34 నిమిషాలకు గవర్నర్ ఏబీవీపీ రాష్ట్ర మహాసభ కార్యస్థలికి బయలు దేరారు.

బీమాతో ధీమా..

- స్వయం సహాయక సంఘాల సభ్యులకు భరోసా
- జిల్లాలో 1,95,539 మంది సభ్యులు
- 18 నుంచి 60 ఏళ్ల లోపు సభ్యులకు ప్రీమియం చెల్లిస్తున్న ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

సిద్దిపేటరూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అందులో భాగంగానే అధిక వడ్డీ రుణ భారం నుంచి మహిళా స్వయం సహాయక సభ్యులను రక్షించడానికి బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు స్త్రీనిధి రుణ పథకం సైతం అమల్లో ఉంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 'మహిళాశక్తి' పేరుతో ప్రత్యేక రుణాలు అందిస్తూ మరింతగా ప్రోత్సహిస్తోంది. వారి కుటుంబాలకు భరోసాగా నిలిచేందుకు మహిళలకు బీమా పథకాలను సైతం అమల్లోకి తెచ్చింది. స్వయం సహాయక మహిళా సంఘాలకు ఉచితంగా రుణబీమా, ప్రమాదబీమా పేరుతో రెండు రకాల ప్రయోజనాలు కల్పిస్తోంది. పొదుపు సంఘం సభ్యురాలు మృతిచెందితే రుణం చెల్లించడం కుటుంబసభ్యులకు భారంగా మారుతోంది. అలాగే అప్పు తీసుకున్న సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే రుణమాఫీతో పాటు ప్రమాద బీమా ద్వారా ఆర్థికసాయం అందుతుంది. రెండు బీమా పథకాలు వారి కుటుంబాలకు అండగా నిలవనున్నాయి. అయితే, ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ రెండు బీమా పథకాలపై క్షేత్రస్థాయిలో మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీటిలో అర్హత సాధించాలంటే తప్పనిసరిగా గ్రూప్ సభ్యులు నెలవారీ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. వాటికి సంబంధించిన వివరాలు మినిట్స్ పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు పొదుపు రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తున్న వివరాలు ఉండాలి. ఇలాంటి బీమా పథకాలపై మహిళా సంఘాల్లో పూర్తి స్థాయిలో అవగాహన లేదు. రుణం పొందే సమయంలో మాత్రమే వీవోలు వివరాలు నమోదు చేస్తున్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘం సభ్యులు



నారాయణరావుపేట మండలం మహిళా సమాఖ్య భవనం

జిల్లాలో 18,274 స్వయం సహాయక సంఘాలు

జిల్లాలో మొత్తం 18,274 స్వయం సహాయ సంఘాల్లో 1,95,539 మంది మహిళా సభ్యులు ఉండగా 726 గ్రామైక్య సంఘాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం స్వశక్తి సంఘాల సభ్యులకు ఉచితంగా రెండు రకాల బీమా సౌకర్యం కల్పిస్తోంది. ప్రతీ సభ్యురాలికి సాధారణంగా అందించే రుణ బీమాతో పాటు సురక్ష పథకంలో భాగంగా ప్రమాదబీమా సదుపాయం అందిస్తుంది. మహిళా సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుండగా ఈ సంవత్సరం మార్చి 14 నుంచి వచ్చే సంవత్సరం 13 మార్చి 2025 వరకు ఈ పథకం వర్తిస్తుంది. రెన్యువల్ చేయడం రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉంటుంది.

సాధారణ మరణానికి రూ.2లక్షలు

స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందించే బీమా పథకం కోసం 18 నుంచి 60 సంవత్సరాల లోపు వయస్సున్న వారే అర్హులు. సంఘం సభ్యురాలు ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.10 లక్షలు బాధిత కుటుంబానికి అందిస్తారు. ఒకవేళ సాధారణ మరణం చెందితే రూ.2 లక్షలు రుణ బీమా చెల్లిస్తారు. గతంలో ఒక సంఘంలోని సభ్యుల్లో ఎవరైనా ఒకరు మృతిచెందినా, రుణం చెల్లించకున్నా మిగిలిన సభ్యులు మృతురాలి కుటుంబంపై రుణం చెల్లించాలని ఒత్తిడి చేసేవారు. ప్రస్తుతం ఆర్థికసాయాన్ని ప్రమాదబీమా పథకం నుంచి చెల్లించే అవకాశం ఉంది. రుణం బకాయి ఉంటే వాయిదా డబ్బు పట్టుకుని మిగిలిన మొత్తాన్ని మృతురాలి కుటుంబానికి అందిస్తారు. ఏది ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా

మిగతా 8వ పేజీలో...

సెలవులో ఆలయ ఈవో

- ఈ నెలాఖరులోనే రిటైర్‌మెంట్
- రెగ్యులర్ ఈవోను నియమిస్తారా..
- ఇన్‌చార్జితోనే కొనసాగిస్తారా..!?
- 29 నుంచి మల్లన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చేర్యాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29న కొమురవెల్లి మల్లన్న కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. అయితే, ఆలయ ఈవో బాలాజీశర్మ వ్యక్తిగత కారణాల వల్ల సెలవు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్ దేవాదాయశాఖాధికారిగా కొనసాగుతున్న బాలాజీశర్మను నాలుగేళ్లక్రితం మల్లన్న ఆలయ ఇన్‌చార్జి ఈవోగా నియమించారు. ఈనెలాఖరుతో ఆయన పదవీకాలం ముగియనున్నది. మూడునెలల పాటు సాగే మల్లన్న జాతరకు భక్తులు భారీగా వస్తారు. ఈ మేరకు మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుంది. ఈ సమయంలో ఆయన సెలవు పెట్టడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కలెక్టర్ ఆలయాన్ని సందర్శించి 25లోగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అత్యంత కీలకంగా వ్యవహరించే ఈవో లేకపోతే పనులు ఎలా సాగుతాయి అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన ఉద్యోగులు కొంతకాలం క్రితం బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారు వచ్చినా స్థానిక స్థితిగతులపై వారికి పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం గమనార్హం. ఈ క్రమంలో బాలాజీశర్మ పదవీకాలం పొడిగిస్తారా? లేదంటే రెగ్యులర్‌స్థాయి అధికారిని నియమిస్తారా? లేక మరో ఆలయ ఈవోకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారా? అన్నది తెలియాల్సి ఉంది.

ఆలయంలో పనిచేయని లిఫ్ట్
వృద్ధులు, దివ్యాంగులకు తప్పని తిప్పలు 8

పౌరసేవలకు ప్రాధాన్యం

- ఫేక్‌కాల్స్‌ను నమ్మవద్దు
- గజ్వేల్ విద్యుత్ శాఖ డీఈ ఆర్.భానుప్రకాశ్



గజ్వేల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పౌరసేవలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని గజ్వేల్ విద్యుత్ శాఖ డీఈ ఆర్.భానుప్రకాశ్ అన్నారు. గజ్వేల్ డివిజన్ పరిధిలో రైతులు, ప్రజల విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామంటున్న డీఈ భానుప్రకాశ్‌తో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గజ్వేల్ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఏడీలు, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో సమన్వయం ఏర్పరుచుకుని ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తున్నాం. మా దృష్టికి వచ్చిన 10 నుంచి 20 నిమిషాల్లో సమస్య పరిష్కారానికి కృషిచేస్తున్నాం.

సమస్య ఉత్పన్నమైనప్పుడు సిబ్బంది, అధికారులను ఎలా అప్రమత్తం చేస్తారు?

అధికారులతో పాటు క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసి, సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వారికి వివరిస్తాం. గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అంశంలో ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరించేందుకు కృషిచేస్తున్నాం. సమావేశాలు నిర్వహించి పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తున్నాం.

సిబ్బందిపై వస్తున్న అవినీతి ఆరోపణలు నిజమేనా?

విద్యుత్‌శాఖ సిబ్బంది పూర్తిస్థాయి పారదర్శకంగా విధులు నిర్వహిస్తున్నారు. ఎవరైనా వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదు. మీటర్ ఏర్పాటు, ఇతర ఏ పౌరసేవల విషయంలోనైనా క్షేత్రస్థాయి సిబ్బంది వసూళ్లకు పాల్పడితే సస్పెండ్ చేస్తాం. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే రాతపూర్వకంగా మా కార్యాలయంలో ఫిర్యాదు చేయాలి. లేదా 040-23454884 లేదా 7680901912 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు.

దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న విషయంలో ఏం చర్యలు తీసుకుంటారు?

క్షేత్రస్థాయి సిబ్బంది పలువురిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న విషయం ఇటీవలే మా దృష్టికి వచ్చింది. వారిని పిలిచి మందలించాం. ఇకపై వినియోగదారులతో ఎవరైనా దురుసుగా ప్రవర్తిస్తే సమీప కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా లేదా నాకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకుంటాం.

విద్యుత్ కార్యాలయాల్లో ఉద్యోగాల పేరిట వస్తున్న ఫేక్ కాల్స్‌పై మీరేమంటారు?

విద్యుత్ కార్యాలయాల్లో ఉద్యోగాల పేరిట అనేక మందికి కాల్స్ వస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఎలాంటి ఉద్యోగమైనా నేరుగా సీఎండీ కార్యాలయం నుంచి నోటిఫికేషన్ విడుదల అవుతుంది. కాబట్టి ప్రజలు ఫేక్ కాల్స్‌ను నమ్మవద్దు.

'గృహజ్యోతి'కి దరఖాస్తు చేసుకోవచ్చా?

విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో ప్రజలకు, రైతులకు సేవ చేయడానికి ఉన్నాం. గృహజ్యోతి పథకంలో భాగంగా ఇంకా ఎవరికైనా 200 యూనిట్ల రాయితీ రానిపక్షంలో దరఖాస్తు చేసుకోవాలి. ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదు.

సర్వర్ డౌన్...!

- యాప్‌లో ఇందిరమ్మ ఇళ్ల వివరాల నమోదులో జాప్యం

మద్దూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను యాప్‌లో నమోదు చేసే క్రమంలో సర్వర్ డౌన్ అవ్వడం వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. ఉమ్మడి మద్దూర్ మండలంలోని 23 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 10422 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొదట ఒకరు 300 ఇళ్ల వివరాలను యాప్ నమోదు చేయాలని సూచించారు. ఆ తర్వాత ఆ సంఖ్యను 750 కి పెంచారు. ఈ క్రమంలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను, ఫొటోను 13 అంశాలతో యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అన్ని వివరాలు పూర్తి చేసి అప్‌లోడ్ చేసే క్రమంలో సర్వర్ డౌన్ అవుతుందని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ఫలితంగా సర్వే నత్తనడకన సాగుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇళ్ల సర్వే వల్ల ఇతర పనులపై కార్యదర్శులు దృష్టిసారించలేకపోతున్నట్లు తెలుస్తోంది. పదిహేను రోజులుగా సర్వే నిర్వహిస్తున్నా సర్వర్ డౌన్ అవ్వడం వల్ల కేవలం 3300 దరఖాస్తుల వివరాలను మాత్రమే యాప్‌లో నమోదు చేసినట్లు మండల అధికారులు చెబుతున్నారు. ఉదయం 10 తర్వాత నుంచి సాయంత్రం 3:30 వరకు సర్వర్ పనిచేయడం లేదని పలువురు తెలిపారు. ఆ తర్వాత స్లోగా పనిచేస్తుండడం వల్ల వేగంగా నమోదు చేయడం ఇబ్బందిగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం పనులు మానుకుని ఇంటి వద్ద ఎదురుచూడాల్సి వస్తోందని, అధికారులు ఇప్పటికైనా మరొకరికి లాగిన్ అవకాశం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని దరఖాస్తుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

యేసు చూపిన మార్గంలో పయనిద్దాం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- హుస్నాబాద్‌లో క్రిస్మస్ వేడుకలు

హుస్నాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యేసు చూపిన కరుణ, ప్రేమ, శాంతియుత మార్గాలో పయనించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సోమవారం హుస్నాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. హుస్నాబాద్‌లో స్థలం సేకరించి చర్చి నిర్మాణం చేపడుతామన్నారు. ప్రజలందరి ఆశీర్వాదంతో, ప్రార్థనలతో తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తి చేసుకుందన్నారు. ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలతో ముందుకు సాగాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆ యేసు ప్రభువును వేడుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, కొంకటి నళినిదేవి, ఎండీ అయూబ్, పలువురు పాస్టర్లు, క్రిస్టియన్లు తదితరులున్నారు.



హుస్నాబాద్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్


గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ


జిల్లెలగడ్డలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని, వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లీన్ చేయాలని సూచించారు.

మహాలయం ముస్తాబు

క్రిస్మస్ వేడుకలకు సిద్ధమవుతున్న మెదక్ సీఎస్ఐ

చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు







మెదక్‌కల్చరల్, డిసెంబరు23: ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మెదక్ సీఎస్ఐ చర్చి క్రిస్మస్ శోభ సంతరించుకుంది. చర్చి నిర్మించి ఈ డిసెంబరు 25 నాటికి వందేళ్లు నిండిన సందర్భంగా అత్యంత వైభవంగా వేడుకలను జరిపేందుకు సీఎస్ఐ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. చర్చిని విద్యుద్దీపాలతో అంగరంగ వైభవంగా ముస్తాబు చేస్తున్నారు. చర్చి చుట్టూ మిరుమిట్లుగొలిపే విద్యుద్దీపాలను అమరుస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వంద సంవత్సరాల క్రితం మెదక్ చర్చిని ఇంగ్లాండ్‌కు చెందిన మత బోధకుడు పాస్నెట్ నిర్మించారు. 174 అడుగుల ఎత్తున నిర్మించిన చర్చి టవర్లు పది కిలోమీటర్ల దూరం వరకు కనిపిస్తాయి. క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడానికి మెదక్ జిల్లా నుంచే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు, పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

కృతజ్ఞత.. ఆరాధన సభ

మెదక్ చర్చి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సోమవారం చర్చి నిర్మాత పాస్నెట్‌కు కృతజ్ఞత ఆరాధన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన రక్తసంబధీకులతో పాటు గతంలో పని చేసిన బిషప్‌లతో పాటు, వివిధ డయాలసిస్‌లకు చెందిన సువార్తీకులు హాజరయ్యారు.



కాళ్లకు పని చెబితేనే క్లాసుకు!

- గువ్వలేగి, ఉప్పరపల్లి, లింగాయిపల్లి తండా, గొడుగుపల్లికి బస్సు సౌకర్యం కరువు
- స్కూలుకు నడిచి వెళ్తున్న విద్యార్థులు 7
- ఐదు నుంచి ఆరు కిలోమీటర్ల దూరం

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- రూ.18 లక్షల విలువైన 24 తులాల బంగారం స్వాధీనం
- సంగారెడ్డి ఎస్పీ రూపేష్ వెల్లడి 7

గీతం పాలక మండలి సభ్యులుగా ఇద్దరు మహిళా ప్రముఖులు

స్వాగతం పలికిన గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గీతం పాలక మండలి (గవర్నింగ్ బాడీ) సభ్యులుగా ఇద్దరు ప్రముఖ మహిళలను నియమించినట్లు సోమవారం యూనివర్సిటీ విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల హైకోర్టులలో న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ కె.విజయలక్ష్మి, ఆర్థిక సేవల నిపుణురాలు, పద్మజ చుండూరు తమ సేవలను అందించనున్నారు. గవర్నింగ్ బాడీ సమావేశంలో కొత్త సభ్యులకు గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ ఘనస్వాగతం పలికారు.





అన్నదాతలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి

రాష్ట్ర రైతు సమైక్య సంఘాల మాజీ అధ్యక్షుడు మంద బలరాంరెడ్డి

గుమ్మడిదల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కష్టాలు ఎన్ని వచ్చిన ఓర్చుకొని తన కుటుంబం గురించి కాకుండా ప్రజలకు అన్నం పెట్టాలని ఆలోచనతో రైతులు నిత్యం తపిస్తుంటారని, దేశానికి అన్నం పెట్టే అలాంటి అన్నదాతలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలని రాష్ట్ర రైతు సమైక్య సంఘాల మాజీ అధ్యక్షుడు మంద బలరాంరెడ్డి పేర్కొన్నారు. గుమ్మడిదల రైతు సంఘం అధ్యక్షుడు పోచుగారి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రైతు సంఘం భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతు లేనిది రాజ్యం లేదని అలాంటి రైతుకు నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు తగిన మద్దతు అందించి, ప్రత్యేక పతకాలతో ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులందరూ సంఘటితంగా ఉంటేనే ప్రభుత్వ పతకాలను సాధించుకునే అవకాశం ఉందన్నారు. ప్రతీ ఏటా గుమ్మడిదల మండలంలో రైతు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది



సన్మానం అందుకున్న అధికారులు, రైతులు

అన్నారు. రైతు దినోత్సవం రైతులకు సంపూర్ణ సహకారం అందించిన అధికారులను, ఆదర్శ రైతులను సన్మానించుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పుట్ట నర్సింగ్, మాజీ సర్పంచు తులసీదాస్, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దార్ గంగాభవానీ, ఏవో శ్రీనివాస్రావు, హెచ్‌వో సంగీత, రైతులు పాల్గొన్నారు.

'షీ'రోస్‌గా మెరిసిన కేంద్రీయ పాఠశాల విద్యార్థినులు


వేషధారణలో విద్యార్థినులు

కంది, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : 'ధీర వనితలు -స్ఫూర్తి కాంతులు' అనే నినాదంతో హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కంది మండల పరిధిలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఉన్న కేంద్రీయ పాఠశాలకు చెందిన 8 మంది షీరోస్ అలంకరణలో ఆకట్టుకున్నారు. విద్యార్థిని నందిని మేజర్ జయసుధగా, వరలక్ష్మి పీటీఉషగా, ప్రవళిక స్మితా సబర్వాల్‌గా, అంజలి సింగర్ మంగ్లీగా, గీత సావిత్రిబాయి పూలేగా, సాత్విక కిరణ్ బేడిగా, స్రవంతి వాణిమూర్తిగా, ఆసియాబేగం ముంతాజ్ ఖాజి వేషధారణల్లో అభినయించారు.

రాష్ట్ర, జాతీయ శక్తి యువత

5వ పేజీ తరువాయి

తెలియజేశారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి మాట్లాడుతూ 1949లో కొద్దిమందితో ప్రారంభమైన ఏబీవీపీ ప్రస్తుతం 50లక్షల మంది సభ్యత్వంతో ప్రపంచంలోనే అతి పెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్‌గా రూపొందిందని తెలిపారు. 75ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొందన్నారు. లాల్‌చౌక్‌పై ఏబీవీపీ జాతీయ జెండాను ఎగురవేసిందన్నారు. రాబోయే రోజుల్లో ఏబీవీపీని మరింత విస్తృతం చేస్తామని తెలియజేశారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ విద్యార్థి సమస్య ఉన్న చోటే ఏబీవీపీ ఉంటుందని అన్నారు. నాణ్యమైన విద్యను అందించాలని చేసిన ఉద్యమ ఫలితమే ఫీజురీయింబర్స్‌మెంట్ అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ మహాసభలకు రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి సుమారు 1500 మంది విద్యార్థులు, ఏబీవీపీ ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మహాసభల స్వాగత సమితి చైర్మన్ అశోక్, ఏబీవీపీ సంయుక్త కార్యదర్శి కల్యాణి, ఏబీవీపీ రాష్ట్ర మహాసభల కన్వీనర్ చంద్రోజు శ్రీనివాస్ ఇతరులు పాల్గొన్నారు.


ఏబీవీపీ రాష్ట్ర మహాసభలో నినాదాలు చేస్తున్న విద్యార్థులు

క్రైం కార్నర్

భార్యాభర్తల మధ్య గొడవ..

భర్త ఆత్మహత్య


భాస్కర్(ఫైల్)

దౌల్తాబాద్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తల మధ్య గొడవతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన దౌల్తాబాద్ మండల పరిధిలో చోటు చేసుకున్నది. దౌల్తాబాద్ ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ముత్యంపేట గ్రామానికి చెందిన తొడంగి భాస్కర్ (27) మహబుబ్‌నగర్ జిల్లాకు చెందిన విజయలక్ష్మి ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. భాస్కర్ మండల పరిధిలోని గాజులపల్లి గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భాస్కర్ ఆయన భార్య విజయలక్ష్మి మధ్య తరుచూ గొడవలు చోటుచేసుకునేవి. ఆదివారం ఉదయం 7 గంటలకు భాస్కర్ తన భార్య విజయలక్ష్మితో సిద్దిపేటకు వెళుతున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. 8:30 గంటలకు భాస్కర్ తన ఫోన్ వాట్సాప్ ద్వారా భార్యకు తాను ఉరేసుకుని చనిపోతున్నానని సమాచారం పంపాడు.భార్య వాట్సాప్ ఓపెన్ చేయలేదు. భాస్కర్ గాజులపల్లికి చెందిన బాబుకు కూడా వాట్సాప్‌లో అన్న నన్ను క్షమించు అని సమాచారం పంపించాడు. దీంతో కుటుంబ సభ్యులు భాస్కర్ కోసం తన పొలం వద్దకు వెళ్లి చూడగా మామిడి చెట్టుకు లబ్బరు తాడుతో ఉరేసుకుని కనిపించాడు. అప్పటికే మృతిచెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వలస కార్మికుడి మృతి

● కొండపోచమ్మ కాలువ పనుల్లో జరిగిన ప్రమాదం


అంజిబాబు మృతదేహం

రాయపోల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ కాలువ పనుల్లో చోటుచేసుకున్న విద్యుదాఘాతంతో వలస కూలీ మృతిచెందిన సంఘటన సోమవారం రాయపోల్ మండల పరిధిలో చోటుచేసుకున్నది. బాధిత కుంటుంబసభ్యులు, రాయపోల్ ఎస్‌హెచ్ఓ కృష్ణంరాజు కథనం ప్రకారం.. కొండపోచమ్మ సాగర్ ద్వారా రామాయంపేటకు వెళ్లే ప్రధాన కాలువ నుంచి గజ్వేల్ మండలం బయ్యారానికి పిల్ల కాలువ పనులు చేపట్టగా, ప్రస్తుతం రాయపోల్ ముంగిస్‌పల్లి శివారులో కొనసాగుతున్నాయి. ఈ కాలువ పనుల కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి పలువురు కార్మికులు వచ్చారు. గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన ఈర్ల అంజిబాబు(19) మూడు నెలల క్రితం పనుల్లో చేరాడు. సోమవారం ముంగిస్‌పల్లి సమీపంలో కాలువ వద్ద కాంక్రీట్‌ను ఖాళీ చేసేందుకు వాహనాన్ని పైకిలేపడంతో విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో వాహనం వద్ద పనుల్లో ఉన్న అంజిబాబు విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. ఆయనను గజ్వేల్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అంజిబాబు సోదరుడు ఈర్ల కోటి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


నితీశ్ మృతదేహం

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి చనిపోయిందని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకున్నది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన మంతూరి నితీశ్(25) తండ్రి చనిపోవడంతో తల్లి, తన చెల్లెలుతో కలిసి పొన్నాల పరిధిలోని టీహెచ్ఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. మృతుడు టైల్స్‌పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కులాలు వేరు కావడంతో పెళ్లికి అంగీరించడంతో ప్రేమించిన అమ్మాయి పురుగులమందు తాగి జూలైలో చనిపోయింది. ఆమె బంధువులు నితీశ్‌పై ఫిర్యాదు చేశారు. అతడిపై కేసు నమోదై జైలుకు వెళ్లొచ్చాడు. తను ప్రేమించిన అమ్మాయి చనిపోవడం, తనపై కేసు కావడంతో మనస్తాపానికి గురైన నితీశ్ తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తల్లి మంతూరి పద్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి


రాథోడ్‌తేజ్‌బాయ్ మృతదేహం

నాగల్‌గిద్ద, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పాము కాటుతో ఓ మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కిషన్ నాయక్ తండాలో సోమవారం చోటు చేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రాథోడ్‌తేజ్‌బాయ్(40) మధ్యాహ్నం ఇంట్లో ఉండగా పాము కాటు వేసింది. దీంతో కుటుంబీకులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. తేజ్‌బాయ్‌కి నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.



కాళ్లకు పని చెబితేనే.. క్లాసుకు..

ఉప్పరపల్లి నుంచి దౌల్తాబాద్‌కు కాలినడకన వస్తున్న విద్యార్థులు

గువ్వలేగి, ఉప్పరపల్లి, లింగాయిపల్లి తండా, గొడుగుపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం కరువు

నడిచి వెళ్తున్న విద్యార్థులు

ఐదు నుంచి ఆరు కిలోమీటర్ల దూరం

దౌల్తాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మారుమూల గ్రామాలవి.. ఆ పల్లెల నుంచి ఏ పని కోసమైనా మండల కేంద్రమైన దౌల్తాబాద్‌కు వెళ్లాల్సిందే. ఇక్కడ సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, వలస కార్మికులే అధికం. వారి పిల్లలు చదువుకోవాలంటే ఐదారు కిలోమీటర్లు వెళ్లాల్సిందే. బస్సు సౌకర్యం లేక పిల్లలకు కాలినడక దిక్కుగా మారింది. గ్రామస్థులు ఏదైనా పని నిమిత్తం వెళ్లాలంటే ఆటోలు నిండేవరకు ఆగాల్సిందే. కనీసం దారైన సరిగ్గా ఉంటుందా అంటే అదీ మట్టి రోడ్డే. గువ్వలేగి, ఉప్పరపల్లి, లింగాయిపల్లి తండా, గొడుగుపల్లి గ్రామాల వారికి ఏళ్లుగా ఈ నరకయాతన తప్పడం లేదు.

బస్సు సౌకర్యం లేక చదువుకు స్వస్తి

లింగాయిపల్లి తండాలోని విద్యార్థులు చదువుకునేందుకు దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇందుప్రియల్, జడ్పీ పాఠశాలకు వెళ్లాలంటే 3 కిలోమీటర్లు నడవాలి. లింగాయిపల్లి తండా నుంచి దాదాపు 9 కిలోమీటర్ల దూరంలో ఉండే దౌల్తాబాద్‌లోని మోడల్ స్కూల్‌కు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లాలంటే అనేక అవస్థలు ఎదుర్కోవాల్సిందే. బస్సు సౌకర్యం లేక తండాలో ముగ్గురు విద్యార్థులు చదువు మానేశారు. ఇక గువ్వలేగి, ఉప్పరపల్లి గ్రామాల విద్యార్థులు దౌల్తాబాద్ మోడల్ పాఠశాల, జడ్పీ బాలుర, బాలిక పాఠశాలకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరుకోవాలంటే 5 కిలోమీటర్ల కాలినడక నడవక తప్పదు. సరైనా రోడ్డు లేక బస్సు సౌకర్యం లేక చాలా మంది విద్యార్థులు 5,7 వతరగతి వరకు చదివి స్వస్తి పలుకుతున్నారు.

రోడ్డు లేక.. బస్సు రాక

గువ్వలేగి, ఉప్పరపల్లి గ్రామాలకు సరైనా రోడ్డు మార్గం లేక గ్రామ ప్రజల అత్యవసర సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. దౌల్తాబాద్‌కు చేరుకునేందుకు ఎన్నో వ్యయప్రయాసల కోర్చి చెరుకుంటున్నారు. ఉప్పరపల్లి ప్రజలు, విద్యార్థులు చెరువు కట్టపై కాలినడవన, వాహనాల్లో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తుంది. గ్రామస్థులు ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయింది.


ఉప్పరపల్లి నుంచి ఆటోలో వస్తున్న విద్యార్థులు

బస్సు రాదు.. మేము ఎట్లా చదువుకోవాలి



గువ్వలేగి గ్రామానికి రోడ్డు బాగాలేక బస్సు రాదు. ఈ తిప్పలు పడలేక చదువులు మానేస్తున్నారు. ఎండ, వాన, చలి ఏదొచ్చినా దౌల్తాబాద్‌కు నడవాల్సిందే. ప్రతీరోజు 6 కిలోమీటర్లు నడవడం తప్పదు. రావడానికి, పోవడానికి నరకయాతన పడుతున్నాం. మేము ఎట్లా చదువుకోవాలి. మా గ్రామానికి రోడ్డు, బస్సు సౌకర్యం కల్పించి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

\- కనకరాజు, గువ్వలేగి

బస్సు సౌకర్యం కల్పిస్తే పైచదువులు చదువుకుంటాం



లింగాయిపల్లి తండాకు బస్సు సౌకర్యం కలిపిస్తే పాఠశాలకు సమయానికి చేరుకుని శ్రద్ధగా చదువుకుంటాం. ఇందుప్రియాల్ జడ్పీ పాఠశాలకు 3 కిలోమీటర్లు నడుచుకుంటు వెళ్లాలి. అధికారులు స్పందించి మా తండాకు బస్సుసౌకర్యం కల్పిస్తే పైచదువులు చదువుకుంటాం.

\-అరుణ్, 9వతరగతి, లింగాయిపల్లి

ప్రభుత్వం చొరవ చూపాలి



ఉప్పరపల్లి గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేక.. బస్సు రావడం లేదు. చాలా మంది చదువులు మానేశారు. మేము ప్రతీరోజు దౌల్తాబాద్‌కు వెళ్లాలంటే 5 కిలోమీటర్లు నడవాల్సిందే. బస్సు సౌకర్యం లేక పాఠశాలలకు, కళాశాలలకు సమయానికి చేరుకోక ఉపాధ్యాయులు, అధ్యాపకులు చేప్పే పాఠాలు మిస్సవుతున్నాం.

\- యం.స్రవంతి, ఉప్పరపల్లి

కేంద్రమంత్రి అమిత్‌షా

రాజీనామా చేయాలి

● జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్


మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్

జహీరాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షా తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ డిమాండ్ చేశారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగంపై చర్చజరుగుతున్న క్రమంలో రాజ్యసభలో కేంద్రమంత్రి అమిత్‌షా మాట్లాడుతూ అంబేడ్కర్ జపం మానాలని చెప్పడం, వ్యంగ్యంగా మాట్లాడిన తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి పదవిలో కొనసాగడానికి అమిత్‌షా అర్హుడన్నారు. బీజేపీ, మోదీప్రభుత్వం పని తీరును ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అంబేడ్కర్‌ను అగౌరవ పరచినందుకు జాతీయస్థాయిలో ఆందోళనలను చేపట్టేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందని, నియోజకవర్గాల్లో, జిల్లాకేంద్రాల్లో నిరసన తెలుపుతామన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటు బీజేపీ అగ్రనేతలు ఎన్నికల్లో చేసిన వ్యాఖ్యలతో ప్రజలు వారికి సరిపడ మెజార్టీని ఇవ్వలేరనే విషయాన్ని గుర్తుచేశారు. విభజించు, పాలించు అనే తరహాలో బీజేపీ పాలన కొనసాగుతుందన్నారు. నేడు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో జరిగే ధర్నా, నిరసన కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో మాజీ టీఎస్ఐడీసీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు నరేష్‌గౌడ్, మండల పార్టీల అధ్యక్షులు రామలింగారెడ్డి, నర్సింహారెడ్డి, హన్మంత్‌రావుపాటిల్, మక్సూద్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్జ్ బాధితులకు అధికంగా పరిహారం చెల్లించాలని కోర్టు ఉత్తర్వులు

నారాయణఖేడ్, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న నిమ్జ్‌తో భూములను కోల్పోతున్న రైతులకు అధికంగా పరిహారం చెల్లించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ తెలిపారు. సోమవారం నిమ్జ్ ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోతున్న రైతులతో కలిసి సంగారెడ్డిలోని కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ వల్లూరి క్రాంతికి కోర్టు ఉత్తర్వు ప్రతిని అందజేశారు. ఆయన వెంట జడ్పీ మాజీ కోఆప్షన్‌సభ్యుడు ఎంఏ.రషీద్‌మదీనా, నాయకులు హన్మంత్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

● రూ.18 లక్షల విలువైన 24 తులాల బంగారం స్వాధీనం

● ఎస్పీ రూపేష్ వెల్లడి


మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేసినట్లు సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ మండలం జన్నారం గ్రామానికి చెందిన ముద్దంగి భీమేష్(25) లేబర్‌గా పనిచేస్తూ హైదరాబాద్ నాంపల్లిలో నివాసముంటున్నాడు. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో తాళం వేసి ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని రాత్రి చోరీలకు పాల్పడేవాడు. అమీన్‌పూర్ బీఎస్ఆర్ కాలనీలో ఆదివారం సాయంత్రం అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.18 లక్షల విలువైన 24 తులాల బంగారు ఆభరణాలు, ఒక టీవీని స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై మొత్తం 41 దొంగతనం కేసులు ఉన్నాయి. భీమేష్‌పై పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్పీ రూపేష్ వెల్లడించారు. ఇళ్లల్లో, సంస్థల్లో సీసీ కెమెరాలను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాల్లోని ఏ ప్రాంతంలోనైనా ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ఎవరైనా ఊరెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, అమీన్‌పూర్ సీఐ సదా నాగరాజు తదితరులు ఉన్నారు.

గుమ్మడిదల మున్సిపాలిటీ ఏర్పాటుపై ఆగ్రహం

రైతుల ధర్నా.. స్తంభించిన ట్రాఫిక్


ధర్నా నిర్వహించి అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

గుమ్మడిదల డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ వద్దు గ్రామపంచాయతీయే ముద్దు అంటూ గుమ్మడిదల ప్రాంత రైతులు నినదించారు. వ్యవసాయ ప్రాంతంగా ఉన్న గ్రామాన్ని రాజకీయాల కోసం మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీలతో పాటు గుమ్మడిదలను పంచాయతీగానే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బాలానగర్ - నర్సాపూర్ ప్రధాన రహదారిపై ధర్నా దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా రైతు సంఘాల సమైక్య ఉపాధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, గ్రామ రైతు సంఘం అధ్యక్షుడు పోచుగారి మోహన్‌రెడ్డి, సీజేఆర్ ట్రస్టు చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, రైతు సంఘం మాజీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, అమ్మగారి వేణుగోపాల్‌రెడ్డి, ఉదయ్ కుమార్ మద్దతు పలికారు. రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. అనంతరం పలువురు రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంగా ఉన్న గుమ్మడిదల మండలాన్ని మున్సిపాలిటీగా మార్చడం అన్యాయమని అన్నారు. పెరిగే టాక్స్‌లను ప్రజలు భరించలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. యథావిధిగా పంచాయతీగా కొనసాగే విధంగా ప్రతీ రాజకీయ పార్టీ నాయకుడు మద్దతు తెలపాలని కోరారు. తహసీల్దార్ గంగాభవానీ, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి హామీతో ధర్నా విరమించారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఉద్యాన పంటలది కీలకపాత్ర

ఉద్యాన యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి


జ్యోతిప్రజ్వలన చేస్తున్న రాజిరెడ్డి, ఆర్‌కె.మథూర్

ములుగు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 5.23 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఉద్యాన పంటలు కీలకపాత్ర పోషిస్తుందని ఉద్యాన యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి పేర్కొన్నారు. ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ 10వ వ్యవస్థాపక దినోత్సవం, జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్ రిసెర్చ్ డైరక్టర్ డాక్టర్ ఆర్‌కె. మథూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దండ రాజిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ స్థూల విలువ ఉత్పత్తికి (జీవీవో) 30శాతం తోడ్పడుతుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం ద్వారా కొత్త పంట రకాలను పరిచయం చేశామని, తెగుళ్లను నియంత్రించామన్నారు. ఈ సందర్భంగా మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ద ఇండియా 2024 గ్రహీతలు లోకసాని పద్మారెడ్డి, వేముల వెంకటేశ్వర్లను సత్కరించారు. పదేళ్ల పురోగతిని బులిటన్ రూపంలో విడుదలచేశారు.

విద్యార్థుల పొలంబాట



అక్షరాలు నేర్చుకునే దశలో ఆ స్కూలు పిల్లలు అన్నదాతల అవతారమెత్తారు. పాఠాలు పక్కన పెట్టి పొలం బాట పట్టారు. బాల్యంలోనే రైతు బాధలు తెలియజెప్పేలా టీచర్లు వింత ఆలోచనకు తెరలేపారు. సోమవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధి నగరం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను పొలానికి తీసుకెళ్లి నాట్లు వేయించారు. రైతులు పండించే పంటలపై అవగాహన కల్పించారు.

\- రామాయంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి)



తగ్గిన దిగుబడి.. పెరిగిన పెట్టుబడి

ధర లేక ఉల్లి రైతుల సతమతం

నారాయణఖేడ్, డిసెంబరు 23: పెట్టుబడి పెరిగి, దిగుబడి తగ్గి గిట్టుబాటు ధర రాక అప్పుల పాలు కావాల్సి వస్తుందని ఉల్లి రైతులు ఆందోళన చెందుతున్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలోని అబ్బెంద, జగన్నాథ్‌పూర్, బాణాపూర్, పిప్రి, పగిడిపల్లి, రుద్రార్, మనూరు మండలం రాణాపూర్, తుమ్నూర్, తదితర గ్రామాలు ఉల్లిసాగుకు ప్రసిద్ధి. గతేడాది ఉల్లిపంటకు మార్కెట్‌లో మంచి ధర లభించడంతో ఈ సీజన్‌లో అధికంగా సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక, దిగుబడి సగానికి పడి పోయింది.

ప్రస్తుతం ఖేడ్ డివిజన్ పరిధిలో దాదాపు 400 చిలుకు ఎకరాల్లో ఉల్లిని సాగు చేశారు. సాధారణంగా ఒక ఎకరాకు 150 క్వింటాళ్ల వరకు ఉల్లి పంట దిగుబడి వచ్చేది. ఈ సంవత్సరం 50 క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదని, రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటకు పెట్టుబడి దాదాపుగా రూ.40 వేల వరకు ఖర్చయిందని, పంట చేతికి అందాక ఉల్లిని తీయడానికి, మార్కెట్‌కు తరలించడానికి మరో రూ.10 వేల ఖర్చు తప్పడం లేదని తెలిపారు. ఇటీవలి వరకు హోల్‌సేల్‌గా క్వింటాల్‌కురూ.4 వేల నుంచి 5 వేల వరకు ఉండేది. పంట చేతికందే సమయానికి ఒక్కసారిగా ధర పడిపోయింది. ఇతర దేశాలకు ఎగుమతిని నిషేధించడంతో పడిపోయిందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉల్లినాణ్యతను బట్టి క్వింటాల్‌కు హోల్‌సేల్‌గా రూ.2 వేల నుంచి 3 వేల వరకు మాత్రమే లభిస్తుందని వాపోతున్నారు. పండించిన పంటను నిల్వ ఉంచుకుందామంటే ఎలాంటి వసతులు లేవని, ప్రభుత్వం కోల్డ్‌స్టోరేజీ సౌకర్యం కల్పిస్తే, అక్కడ నిల్వ ఉంచుకునే అవకాశం ఉంటుందని రైతులు వేడుకుంటున్నారు.

గిట్టుబాటు ధర లేదు



కష్టపడి ఉల్లిపంటను పండించిన గిట్టుబాటు ధర లభించడం లేదు. అర ఎకరంలో ఉల్లి పంటను సాగు చేశా. గతంలో 60 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 20 క్వింటాళ్లు కూడా రావడం లేదు. తగ్గిన ధరలకు విక్రయిస్తే పెట్టిన పెట్టుబడులు కూడా దక్కవు.. ధర పెరిగాక విక్రయించుకునే విధంగా ప్రభుత్వంకోల్డ్‌స్టోరేజీ సౌకర్యాన్ని కల్పిస్తే బాగుంటుంది.

\- రమేష్, రైతు,పిప్రి

రోడ్డు ప్రమాదంలో

కూలీ మృతి

రామచంద్రాపురం, డిసెంబర్ 23 : రోడ్డు ప్రమాదంలో ఓ కూలీ మృతి చెందిన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) సర్వీసు రోడ్డుపై ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. సీఐ రవీందర్ కథనం ప్రకారం... కొల్లూరులో నివాసముంటున్న షేక్ అక్బర్ (38) ఆదివారం రాత్రి బైక్‌పై కొల్లూరు బయలు దేరాడు. మార్గమధ్యంలో బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తీవ్రగాయాలైన అక్బర్ అక్కడికక్కడే దుర్మణం చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని సీఐ పేర్కొన్నారు. భార్య షేక్ అమీనాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

టీజీసీటీఏ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా డాక్టర్ భవాని



గజ్వేల్, డిసెంబరు 23(ఆంధ్ర జ్యోతి): తెలంగాణ రాష్ట్ర గవర్నమెంట్ కాలేజీ టీచర్ల అసోసియేషన్ మహిళా విభాగం కార్యదర్శిగా గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ మచ్చ భవానీ రెండోసారి ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సమక్షంలో ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ క్లబ్‌లో ఎన్నికలను నిర్వహించగా, రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజూమ్, అధ్యాపక బృందం ఆమెను అభినందించారు.

గౌడజన హక్కుల పోరాటసమితి మోకుదెబ్బ అధ్యక్షుడిగా భూపతిగౌడ్

మిరుదొడ్డి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గౌడజనహక్కుల పోరాటసమితి మోకుదెబ్బ మిరుదొడ్డి మండల అధ్యక్షుడిగా (మల్లుపల్లి)సిద్ధిని భూపతిగౌడ్‌ను సోమవారం ఆ సంఘం నాయకులు సిద్దిపేటలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించినవారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

సిద్దిపేట రూరల్, డిసెంబరు 23(ఆంధ్ర జ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్ గ్రామానికి చెందిన గాంద్రపాటి స్వామి కొద్దిరోజులుగా పక్షవాతంతో బాధపడుతుండగా కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణకు దృష్టికి తీసుకెళ్లగా సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.2.50లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు సోమవారం హరికృష్ణ ఎల్‌వోసీని బాధిత కుటుంబానికి అందజేశారు.

● కుకునూరుపల్లి: మండలకేంద్రానికి చెందిన పలువురికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ రాష్ట్ర ఎన్‌ఆర్‌ఈజీఎస్ సభ్యురాలు కోల సద్గుణ రవీందర్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం అందజేశారు. కుకునూరుపల్లికి చెందిన బాలయ్యకు రూ. 37వేలు, విజయలక్ష్మికి రూ. 15వేల విలువైన చెక్కులను అందజేశారు.

పాఠశాలకు ఫర్నిచర్ అందజేత

సిద్దిపేట రూరల్, డిసెంబరు 23(ఆంధ్ర జ్యోతి): అమెరికాలో స్థిరపడిన నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ మొసర్ల జానకి మాధవరెడ్డి జక్కాపూర్ ఉన్నత పాఠశాలకు రూ.40 వేల విలువ చేసే ఫర్నిచర్‌ను సోమవారం అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం షౌకత్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా మాధవరెడ్డిని అభినందించారు.

మహాసభలను విజయవంతం చేయాలి

దుబ్బాక, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 28 నుంచి 30 వరకు జరిగే టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం దుబ్బాక మండల అధ్యక్షుడు బొంబాయి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం దుబ్బాక మండలం గంబీర్‌పూర్ గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర వైజ్ఞానిక మహాసభల పోస్టర్లను విడుదల చేశారు.

మల్లన్న ఆలయంలో పని చేయని లిఫ్ట్

- వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ఓ భక్తుడి ఉదారతతో ఏర్పాటు
- నిర్వహణను పట్టించుకోని సిబ్బంది
- కొన్నాళ్లకే మొరాయించిన వైనం
- బ్రహ్మోత్సవాల వరకైనా మరమ్మతులు చేయించాలని భక్తుల డిమాండ్




పని చేయని లిఫ్ట్, సామగ్రిని తరలించేందుకు లిఫ్ట్ వద్ద వేచి చూస్తున్న భక్తులు

చేర్యాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో లిఫ్ట్ పని చేయడం లేదు. కొద్ది రోజులుగా మొరాయిస్తున్నప్పటికీ ఆలయాధికారులు పట్టించుకోకపోవడంతో దివ్యాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయానికి రెండు మార్గాలలో ఉన్న మెట్లు ఎక్కి స్వామివారిని దర్శించుకోలేక వృద్ధులు, దివ్యాంగులు ఆరుబయట నుంచే దండం పెట్టుకుని వెనుదిరిగిపోతున్న క్రమంలో ఓ భక్తుడు కొన్ని నెలల క్రితం ఉదారంగా లిఫ్ట్ ఏర్పాటు చేయించారు. కానీ జాతరతో పాటు సాధారణ రోజుల్లో ఆలయవర్గాలు, ధర్మకర్తలు తమ అనుయాయులు, వీఐపీలు, ఇతరుల కోసం ఇష్టానుసారంగా లిఫ్ట్ వినియోగించడంతో కొన్నాళ్లకే మొరాయిస్తున్నది. దీంతో దివ్యాంగులు, వృద్ధులకు ప్రయోజనం చేకూరకపోగా, ఏ ఉద్దేశంతోనైతే భక్తుడు లిఫ్ట్‌ను ఏర్పాటు చేయించాడో ఆ లక్ష్యం నీరుగారిపోతున్నది. నిర్వహణతో పాటు పర్యవేక్షణ కరువై కొన్ని నెలల వ్యవధిలోనే పాడైపోయింది. ఈనెల 29న జరగనున్న మల్లన్న కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండటంతో అధిక సంఖ్యలో వృద్ధులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో వెంటనే లిఫ్ట్ మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

దివంగత పీవీ నర్సింహారావుకు ఘన నివాళి



పీవీ చిత్ర పటం ఎదుట నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహరావు వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, నాయకులు బంక చందు, చిత్తారి రవీందర్, అయిలేష్ యాదవ్, నర్సాగౌడ్, ఎండీ హసన్, అనిల్ గౌడ్, భగవాన్, నాంపల్లి సమ్మయ్య, కేశవేని రమేశ్, కిష్టస్వామి, శ్రీనివాస్ తదితరులున్నారు.

● కోహెడ: మండలకేంద్రంలో పీవీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సేవాసమితి నాయకులు పిడిశెట్టి రాజు, తెలంగాణ రాష్ట్ర జాక్ కన్వీనర్ మంద మల్లేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ అంకుష్, డాక్టర్ వేల్పుల జయశంకర్, వేముల శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, రాచురి మల్లేశం, జీ రమేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకలో ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్ కవాతు

దుబ్బాకలో ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్ ఫ్లాగ్‌మార్చ్

దుబ్బాక, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు ఎవరూ విఘాతం కల్గించవద్దని దుబ్బాక సీఐ శ్రీనివాస్ సూచించారు. సోమవారం దుబ్బాకలోని ప్రధాన వీధులగుండా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు స్థానిక పోలీసు అధికారులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. కార్యక్రమంలో దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి ఎస్‌ఐలు గంగరాజు, పరశురాం, హరీశ్, ర్యాపిడ్‌యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ టీపీ బగేల్, ఇన్‌స్పెక్టర్లు హరిబాబు, మల్లేశ్వరరావు, పోలీసు, ఆర్‌ఏఎఫ్ సిబ్బంది న్నారు.

శ్రీనివాస రామానుజన్ సేవలు మరువలేనివి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు

గజ్వేల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ సేవలు మరువలేనివని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజూమ్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర దినోత్సవాన్ని కళాశాల గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించగా, రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గణిత శాస్త్రానికి రామానుజన్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, అధ్యాపకులు వెంకటేశ్, మహేందర్, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామచంద్రం, విజయ్‌భాస్కర్‌రెడ్డి, పెద్ది రాజు, అమలాదేవీ, మార్కండేయ ఉన్నారు.

● సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని క్రాంతి స్కూల్‌లో గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు గణిత ప్రదర్శనలు ప్రదర్శించారు. గణిత నిధి వేట, గణిత అవధానం, గణిత మేథో విజ్ఞాన పోటీ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ గెలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

పాఠశాలల్లో జాతీయ రైతు దినోత్సవం



రాయపోల్ మండలం కొత్తపల్లి పాఠశాలలో రైతుల వేషధారణలో విద్యార్థులు

చేర్యాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రైతుదినోత్సవాన్ని సోమవారం చేర్యాల పట్టణంలోని పంచతంత్ర పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతు వేషధారణతో సాంస్కృతిక ప్రదర్శన చేపట్టారు. అనంతరం విద్యార్థులను సమీపంలోని వ్యవసాయక్షేత్రం సందర్శనకు తీసుకువెళ్లి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పలువురు రైతులను శాలువా కప్పి సత్కరించారు.

● రాయపోల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో కిసాన్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులందరూ రైతుల వేషధారణతో పాఠశాలకు హాజరయ్యారు. ఆవరణలో నాగలిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ దేశానికి వెన్నెముకలాంటి రైతులను అందరం గౌరవించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు వంశీకృష్ణ, మల్లికార్జున్, స్రవంతి, మంజుల, శృతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులకు రక్షణ చట్టం కల్పించాలి



మాట్లాడుతున్న యాదగిరి శేషగిరిరావు

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 23(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 11 వేల ప్రైవేట్ విద్యాసంస్థల్లో 4.50లక్షల మంది పని చేస్తున్న ఉపాధ్యాయులకు రక్షణ చట్టం కల్పించి వేతన చట్టం అమలు చేయాలని ప్రైవేట్ విద్యాసంస్థల (ట్రస్మా) చీఫ్ అడ్వయిజర్, ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేషగిరిరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హుస్నాబాద్‌లోని కేరళ ఇంగ్లిష్‌మీడియం హైస్కూల్‌లో విలేకరులతో మాట్లాడారు. అనేక వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో చూపడం లేదని విమర్శించారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రూ. 10 లక్షల బీమా, హెల్త్‌కార్డులు అందజేయాలన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రాజేందర్, నియోజకవర్గ అధ్యక్షుడు కాయిత నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింహరెడ్డి, కార్యదర్శి శైలెందర్, కోశాధికారి శ్రీదర్‌రెడ్డి ఉన్నారు.

'రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి'

చిన్నకోడూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతుల పట్ల మండల రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు సూరగోని శేఖర్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కమిషనర్ సర్వే, సెటిల్‌మెంట్స్, ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.మండలంలోని పలువురు రైతులు సర్వేకోసం పెట్టుకున్న దరఖాస్తులను అకారణంగా రద్దు చేసిన రెవెన్యూ అధికారులు, సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై గతంలో సిద్దిపేట జిల్లా భూకొలతల శాఖ ఏడీ, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం



తునికిఖాల్సా రైతువేదికలో మాట్లాడుతున్న అధికారులు

వర్గల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతులందరు ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తుందని మండల వ్యవసాయాధికారి శేషశయన పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తునికిఖాల్సా రైతు వేదిక భవనంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులతో పాటు సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 12 వేల ఎకరాల ఆయిల్ పామ్ సాగవుతుందన్నారు. మండలంలో 265 ఎకరాలలో సాగు అయిందన్నారు. మొక్కలకు, డ్రిప్‌కు 90శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్టు తెలిపారు. తోట పెంపకం నిర్వహణ ఖర్చుల కింద ఏడాదికి ఎకరాకు రూ. 4,200చొప్పున సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ప్రస్తుతం టన్ను ధర రూ. 20,400 ఉందని, భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

ఆయిల్‌పామ్ అధికారులు శంకర్, అనిల్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగులో తీసుకోవలసిన ఎరువులు, యాజమాన్య పద్ధతులు, నీటి యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై రైతులకు వివరించారు. మొదటి మూడు సంవత్సరాలు కూరగాయల పంటలు అంతర్ పంటలుగా సాగు చేసుకుని లాభాలను పొందవచ్చాన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు సంతోష్, ధర్మేందర్, భారతి, సుప్రజ రైతులు జహంగీర్, జానీ, స్వామి, కిష్టారెడ్డి, లక్ష్మన్, విద్యాకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి: ఏవో

మర్కుక్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యాసంగి సాగులో డిసెంబరు జనవరి నెలలో అధిక చలి ఉండటం వలన వరి పంటలో సమస్యలు తలెత్తుతాయని మండల వ్యవసాయ అధికారి వసంతరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మర్కుక్‌లో పలువురు రైతుల నారు మడులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక చలిమూలంగా వరినారు ఎండిపోవడం, నారు ఎదగకపోవడం జింకు ధాతు లోపం కారణంగా ప్రధాన సమస్యలు వస్తాయన్నారు. ఈ సమస్యలను అనుగమించడానికి సస్యరక్షణ చర్యలు పాటించాలని సూచించారు. రాత్రి వేళలో చలి ఉధృతి ఎక్కువగా ఉండటం వలన వరి నారుమడిపై పాలిథీన్ షీట్ లేదా టార్పాలిన్లను, ప్లాస్టిక్ సంచులతో కుట్టిన పట్టాలను గానీ రాత్రి వేళల్లో కప్పి ఉంచి మరుసటి రోజు ఉదయాన్నే తీసివేయాలన్నారు. రాత్రిపూట నారుమడిలో నీరు లేకుంటే చలి ప్రభావం మొక్కలపై తక్కువ గా ఉంటుంది కాబట్టి ప్రతిరోజూ ఉదయం నీటిని పట్టి సాయంత్రం తీసివేయాలన్నారు. యాసంగిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది కాబట్టి నారుదశ నుంచి తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు విష్ణు, రజనీకాంత్ మీనాక్షి పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు అందజేత

గజ్వేల్ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో విద్యార్థులకు టైబెల్టులు, ఇంగ్లిష్ ల్యాబ్, స్పోకెన్ ఇంగ్లిష్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ టీచర్ సత్యనారాయణ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గోలి సంతోష్, లయన్ సంజయ్ గుప్తా, లయన్ నేతి శ్రీనివాస్, లయన్ పరమేశ్వర చారి, లయన్ మల్లేశంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి 'యోగా'కు గురుకుల విద్యార్థి

చేర్యాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సాంఘిక, సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.భాను జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న భాను అత్యుత్తమ ప్రతిభ కనబరచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. వచ్చే జనవరి 13వతేదీన మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు తరుపున పాల్గొననున్నాడు. సోమవారం ప్రిన్సిపాల్ లింగాల పుల్లయ్య తదితరులు భానుతో పాటు పీడీ సురేశ్ అభినందించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

గజ్వేల్ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో చోటు చేసుకున్నది. మండలం లోని అహ్మదీపూర్‌కు చెందిన చాడ బాల్‌రెడ్డి అనే రైతు పొలం వద్ద వ్యవసాయం పనులు చేసుకుంటూ ఎప్పటిలాగే పశువులను మేతకు వదిలేశాడు. పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగలడంతో పాడి గేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.

పలుచోట్ల ముందస్తు క్రిస్మస్ సంబురాలు



క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

గజ్వేల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో అన్ని కులాలు, మతాలు సమానమేనని శాసనమండలి సభ్యుడు డాక్టర్ యాదవరెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని క్రిస్టియన్ భవన్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో వారు ముఖ్య అతిథులుగా హజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, రూబెన్ తదితరులున్నారు.

సిద్దిపేట సీఎస్ఐ చర్చిలో..



సిద్దిపేటలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట కల్చరల్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట సీఎస్ఐ చర్చిలో ముందస్తు క్రిస్మస్ సంబురాలు నిర్వహించారు. కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ క్రైస్తవుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం చర్చి ఫాదర్ ఆంటోనితో పాటు పలువురిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.

ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి



డీఎంహెచ్‌వోను సన్మానిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రుల యజమానులు

సిద్దిపేట టౌన్, డిసెంబరు23(ఆంధ్ర జ్యోతి): సిద్దిపేట జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు నియమ నిబంధనలు పాటించాలని జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ పల్వన్ కుమార్ సూచించారు. సోమవారం పట్టణంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సిద్దిపేట జిల్లాలో గల ప్రైవేట్ ఆసుపత్రుల యజమానులు సిద్దిపేట జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ పల్వన్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి సన్మానించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాజ్ సురేష్

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకమాట, అధికారంలోకి వచ్చాక మరోమాట మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి ద్వంద్వ వైఖరిని వీడి సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాజ్ సురేష్. సిద్దిపేట కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులకు తపస్ ఆధ్వర్యంలో సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళీధర్, రాష్ట్ర కార్యదర్శులు పబ్బతి శ్రీనాకర్ రెడ్డి, సింగోజు జనార్దన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

'రైతుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి'

గజ్వేల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతాంగ సంక్షేమానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులతో కలసి పలువురు రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదని, దేశానికి అన్నం పెట్టే రైతన్నల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. ఆయన వెంట వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, డైరెక్టర్లు నర్సింహారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, యాదయ్య, నాయకులు తదితరులున్నారు.

పంట బీమా పథకాన్ని అమలు చేయాలి: బీజేపీ

కోహెడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం డిమాండ్ చేశారు. సోమవారం రైతు దినోత్సవం సందర్భంగా మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన దానబోయిన రాజు, బిరెడ్డి లక్ష్మారెడ్డిలను ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విపత్తుల వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పంట బీమా పథకాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేవైఎం మండల అధ్యక్షుడు కంది సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

తోటివారికి సాయపడాలి: ఎస్ఐ

చేర్యాల, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): తోటివారికి సహాయాన్ని అందించి సమాజహితానికి పాటుపడాలని చేర్యాల ఎస్ఐ నీరేశ్ పేర్కొన్నారు. పలువురు వస్త్రాలు, వస్తువులు పేదలకు అందించేందుకు వేదికగా చేర్యాల పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అందె విజయ్‌కుమార్ స్థానిక ఇండియా మిషన్ కాంపౌండ్ ఆవరణలో గివింగ్ హ్యాండ్స్ పేరిట వాల్ హ్యాంగర్లు ఏర్పాటు చేశారు. సోమవారం ఎస్ఐ నీరేశ్ వాల్‌హ్యాంగర్ కార్యక్రమాన్ని ప్రారంభించి అందె విజయ్‌కుమార్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రభుదాస్, పీటర్, కోతి యాకూబ్, అమల కిస్రోలైట్, ఓనేసిమ్, జెస్సిరాజ్, జోయెల్ రాజు పాల్గొన్నారు.

'బీమా'తో ధీమా

(5వ పేజీ తరువాయి.)

ప్రవేశపెట్టిన బీమా బీమా పథకం పై స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీమాతో మహిళల కుటుంబాలకు మేలు



ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా మహిళల కుటుంబాలకు అండగా నిలుస్తుంది. స్వయం సహాయక సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు రుణాలు అందించడంతో పాటు సభ్యులు మరణిస్తే సంఘం సభ్యులకు, కుటుంబ సభ్యులకు భారం కాకుండా అండగా ఉంది. ప్రభుత్వం ప్రత్యేక చొరవతో బీమా పథకం తీసుకురావడం హర్షించదగ్గ విషయం.

-దుంపటి రమణ, గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు, శేఖర్‌రావు పేట

మహిళా సంఘాలకు ప్రయోజనం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకంతో స్వయం సహాయక సభ్యులకు చాలా ప్రయోజనం చేకూరనుంది. బీమా ద్వారా వచ్చిన డబ్బుతో సభ్యురాలు బకాయి ఉన్న మొత్తం రుణం పట్టుకుని మిగిలిన డబ్బును నామినికి అందజేస్తారు. బీమా పథకం మహిళా సంఘాల సభ్యులకు అండగా నిలుస్తుంది.

- పి. యాదమ్మ, మండల సమాఖ్య కార్యదర్శి, నారాయణరావు పేట